క్లుప్తంగా

18న కౌన్సెలింగ్

బాడంగి: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి, ఈ నెల 18వ తేదీన కొప్పెర్లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్ల భర్తీ ఉంటుందని, ప్రవేశ పరీక్ష రాసి, అర్హత సాధించిన విద్యార్థులంతా ఆరోజు ఉదయం 9 గంటలకే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రవేశపరీక్ష హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్, నాలుగు ఫొటోలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజ్యలక్ష్మి

తెర్లాం: మండల తహసీల్దార్‌గా బి.రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసన్నకుమార్ కొన్నిరోజులు మాత్రమే విధులకు హాజరై, ఆ తర్వాత విధులకు హాజరుకాలేదు. దీనిపై మండిపడిన బొబ్బిలి ఆర్డీవో ఆయన స్థానంలో కొత్తవారిని నియమించాలని కలెక్టర్, ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన స్థానంలో విజయనగరం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న బి.రాజ్యలక్ష్మిని తెర్లాం తహసీల్దార్‌గా నియమించారు.

అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


గోపాలపురం సబ్‌స్టేషన్ వద్ద అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఈఈ సురేష్‌బాబు

రాజాం సిటీ: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఆ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని గోపాలపురం సబ్‌స్టేషన్ వద్ద రూ.1.25 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు తరచూ తలెత్తుతున్న విద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు డిజిటల్ పేమెంట్స్ వైపు మొగ్గుచూపాలని, బిల్లులు తీసిన 14 రోజుల్లోగా చెల్లింపులు చేపడితే తర్వాత వచ్చే బిల్లులో సర్‌చార్జి మినహాయింపు వస్తుందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ కుమార్, ఏఈ ఓజేసీఏ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద శిక్షణార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. నీతిఆయోగ్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు సంయుక్తంగా బొత్స గురువినాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా మండలంలోని 35 మంది నిరుద్యోగ యువతీయువకులకు టూవీలర్ మెకానిజం, కార్పెంటర్, జ్యూట్ మేకింగ్, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల తయారీపై శిక్షణ అందించారు. మార్చి 9 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఈ శిక్షణా కార్యక్రమాలు జరిగాయని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో బొత్స గురువునాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రవికిరణ్, కో–ఆర్డినేటర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ

రాజాం సిటీ: అవగాహనతోనే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఎఫ్‌వో టి.ఎస్.ఎస్.జనార్దనరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండ్ ఆవరణ, అంబేడ్కర్ జంక్షన్‌లలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు ప్రదర్శనల ద్వారా అగ్నిప్రమాదాలు ఎలా నివారించవచ్చో తెలియజేశారు. అనంతరం అగ్నిమాప కేంద్రం నెంబర్లతో కూడిన కరపత్రాలను సినిమా హాళ్లు, దుకాణాలతో పాటు అంబేడ్కర్ జంక్షన్, బస్టాండ్ ఆవరణలో పంపిణీ చేశారు. అనంతరం మెయిన్‌రోడ్డులో అవగాహనా ర్యాలీ చేపట్టారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

మెంటాడ: మండలంలోని ఆండ్ర, లోతుగెడ్డ వ్యాపారుల గొడౌన్‌లలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయి డీటీ రవికుమార్ సోమవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆకస్మికదాడులు నిర్వహించి, ముగ్గురు వ్యక్తుల నుంచి 1700 కిలోల బియ్యం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి, కేసు నమోదు చేశామన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం


బాడంగి: ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి


వంగర: తలగాంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

వంగర:

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొప్పర, కొండచాకరాపల్లి, కె.కొత్తవలస, తలగాం, వంగర గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయా నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, సీఎం జగనన్న ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని, ఆయనకు మనమంతా అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిచర్ల విజయలక్ష్మి, సర్పంచ్‌లు గర్భాపు నారాయుడు, గొయ్యమ్మ, సంకిలి సురేష్, కనగల పారినాయుడు, యలకల అన్నంనాయుడు, ఉత్తరావెల్లి గణేష్‌బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలను నమ్మొద్దు..

బాడంగి: మండలంలోని రేజేరు, పినపెంకి, ఆనవరం, పి.వెంకంపేట తదితర గ్రామాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీ గెలిస్తేనే మనమంతా బాగుంటామని, మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఓటు, ఎంపీ ఓటు ఫ్యాన్ గుర్తుకే వేసి, తమను గెలిపించాలని వారు కోరారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో ప్రజలను బురిడీ కొట్టేందుకు సిద్ధమైన టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలన కొనసాగిస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి..

బొబ్బిలి: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఎమ్మెల్యే ఓటు, ఎంపీ ఓటు వేసి, తనను, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు రైల్వేలైన్ వద్ద ఉన్న అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కొత్తగా నిర్మిస్తున్న ఆలయాన్ని పరిశీలించారు. ఎన్నికలు వస్తున్న వేళ టీడీపీ కూటమి నేతలు మాయమాటలు చెప్పి, ఓట్లు దండుకోవడానికి సిద్ధమయ్యారని, వారిని నమ్మవద్దన్నారు. అన్ని వేళలా అందరికీ అండగా నిలిచిన సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో 21వ వార్డు ఇన్‌చార్జ్ చంద్రపూడి రమేష్, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్


రాజాం: ఇల్లంనాయుడువలసలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


రేగిడి: వెంకమ్మపేటలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు


బొబ్బిలిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సతీమణి చిన్నమ్మలు, తదితరులు


రాజాం సిటీ: గార్రాజుచీపురుపల్లిలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి


పాగిరి వైఎస్సార్ సీపీ నేతలతో సమావేశమైన ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. రాజాం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌తో కలిసి మండలంలోని పాగిరి గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆయన మండలంలో అతిపెద్ద పంచాయతీ పాగిరేనని, ఇక్కడి నుంచి పార్టీకి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. నెల రోజులు అహర్నిశలు కష్టపడితే మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూనే టీడీపీ కూటమి అన్యాయాలు, అక్రమాలు, మోసాలను ఎండగట్టాలన్నారు. ప్రతిఒక్కరి ఓటు వైఎస్సార్ సీపీకే పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల అధ్యక్షులు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పాగిరి సర్పంచ్ పాగిరి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

బొబ్బిలి: పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. స్థానిక పట్టణంలోని కోరాడ, రాతిపని వారి వీధుల్లో సోమవారం పర్యటించిన ఆమె అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు.

వలంటీర్ల రాజీనామా


తమ రాజీనామా పత్రాలు చూపిస్తున్న పాగిరి వలంటీర్లు


వంగర: రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు అందిస్తున్న కొప్పర, కె.కొత్తవలస గ్రామ వలంటీర్లు


రామభద్రపురం: రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు


బాడంగి: కోడూరులో రాజీనామా చేసిన వలంటీర్లు

రాజాం: మండలంలోని పాగిరి గ్రామానికి చెందిన 32 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వీరంతా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి ఒక్కొక్కరిగా చేరుకుని, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఇప్పటివరకు ఆరుగురు మాత్రమే రాజీనామా పత్రాలు సమర్పించగా, ఒక్కొక్కరు మాత్రమే రావాలని ఎంపీడీవో తెలిపినట్లు వారు తెలిపారు. అయితే మిగిలిన వారు కూడా తమ రాజీనామాలపై ఎంపీడీవోకు ముందస్తు సమాచారం అందించారన్నారు.

వంగర: మండలంలోని కొప్పర, కె.కొత్తవలస, మద్దివలస గ్రామాలకు చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. అనంతరం వారు తమ రాజీనామా పత్రాలను మండల కేంద్రంలోని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజ్‌కు సోమవారం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించారని, రానున్న ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు శ్రమిస్తామన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రానికి చెందిన 49 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అనంతరం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మకు సోమవారం అందజేశారు.

తెర్లాం: మండలంలోని నెమలాం, కుసుమూరు, తెర్లాం, కూనాయవలస గ్రామాలకు చెందిన వలంటీర్లంతా రాజీనామా చేసి, వారి రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను ఐదేళ్ల క్రితం గ్రామ వలంటీర్లుగా సీఎం జగనన్న నియమించి, తమకు సొంత గ్రామాల్లోనే మంచిపేరు తెచ్చుకునేలా చేశారన్నారు. ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామన్నారు.

బొబ్బిలి: మండలంలోని పిరిడిలో 30 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అలాగే కలువరాయి గ్రామంలోని 14 మంది వలంటీర్లు రాజీనామా చేసి, తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు.

బాడంగి: మండలంలోని కోడూరు, గజరాయునివలస గ్రామ వలంటీర్లు రాజీనామా చేసి, తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు.

సంతకవిటి: మండలంలోని గోళ్లవలసలో 10 మంది, తలతంపరలో 9 మంది, సంతకవిటిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేశారు.


తెర్లాం: కూనాయవలసలో రాజీనామాపత్రాలతో వలంటీర్లు


బొబ్బిలి: రాజీనామా చేసిన పిరిడి వలంటీర్లు


బొబ్బిలి: రాజీనామా పత్రాలతో కలువరాయి వలంటీర్లు

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు


ఉపకరణాల పంపిణీకి దివ్యాంగ చిన్నారులకు లోప నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రామభద్రపురం: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ఎంఈవో తిరుమలరావు ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాలు అందజేతకు లోపనిర్ధారణ పరీక్షలు, అర్హత గుర్తింపు వంటివి సోమవారం నిర్వహించారు. బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల నుంచి 18 ఏళ్లలోపు వయసున్న 150 మంది దివ్యాంగ చిన్నారులు హాజరు కాగా, వీరికి ఎముకల వైద్య నిపుణుడు ఎన్.రవిశంకర్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ హెప్సిబా వైద్య పరీక్షలు చేసి, లోప నిర్ధారణ ఖరారు చేశారు. అవసరమైన వారికి వీల్ చైర్లు, రొలేటర్లు, ట్రైసైకిళ్లు, ఎంఆర్ కిట్లు వంటి ఉపకరణాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాలు గల పిల్లలకు విద్యతో పాటు ఫిజియోథెరపీ కూడా చేయిస్తున్నామన్నారు. భవిత కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్‌లు, స్టైఫండ్, ఇంటి వద్దనే విద్య, రీడర్ అలవెన్స్‌లు ఇవ్వడంతో పాటు అలెమ్కో కాన్పూర్ వారిచే ప్రతిఏటా ఉపకరణాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, సునీల్, పాపారావు, కళావతి, ఐఈఆర్‌టీలు రాజేశ్వరి, రవి, తేజశ్విని, సూర్యసత్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి కూటమి కుట్రే..

- జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు


సంతకవిటి: సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, తదితరులు


రామభద్రపురంలో కొవ్వొత్తులు వెలిగించి, సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద కొవ్వొత్తుల ర్యాలీలో పార్టీ శ్రేణులు


మెంటాడ: నల్లరిబ్బన్లు ధరించి, నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంతకవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరిట చేస్తున్న బస్సుయాత్రకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూడలేకే టీడీపీ కూటమి నేతలు కుట్రతో ఆయనపై దాడికి పాల్పడుతున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మల్లయ్యపేట వద్ద పార్టీ నేతలతో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో పాటు కూటమి పార్టీల నేతలంతా ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నారని, వాటిని శాంతియుతంగా ఓటు అనే ఆయుధంతో ఓటర్లే అడ్డుకోవాలన్నారు. ముఖ్యమంత్రిపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనన్నారు. ఇలాంటి దాడులు చేయడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఓటమి భయంతోనే ప్రతిపక్షాలు పక్కా ప్లాన్‌తో సీఎం జగన్‌పై దాడి చేయిస్తున్నాయన్నారు. చేశారని విమర్శించారు. హింసా రాజకీయాలు ప్రోత్సహించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అటువంటి వారితో పాటు దాడులకు ప్రోత్సహించే వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సంతకవిటి మండల అధ్యక్షుడు గురుగుబెల్లి స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: సీఎం జగన్‌పై హత్యాయత్నం అమానుషమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మీనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులతో కలిసి ఆయన కొవ్వొత్తులు చేతపట్టి, సీఎం జగన్‌పై ఆగంతకులు జరిపిన దాడిని ఖండించారు. పార్టీకి, ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి, ఓర్వలేకనే ఈ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయమన్నారు.

మెంటాడ: సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తూ మండల వైఎస్సార్ సీపీ నాయకులు నల్లరిబ్బన్‌లు ధరించి, నిరసన తెలిపారు. అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిపై ప్రతిపక్షాలు కావాలనే దాడులు చేయిస్తున్నాయని ఆరోపించారు. ఓటమి భయంతోనే టీడీపీ, కూటమి నేతలు ఇదంతా చేస్తున్నారని విమర్శించారు. ఇదే కొనసాగితే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటర్లు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

రేగిడి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి అనేది అత్యంత హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ నేతలు ఖండించారు. విజయవాడలో బస్సుయాత్రలో జగనన్నపై ఆగంతకులు జరిపిన రాళ్ల దాడిని నిరసిస్తూ మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద పార్టీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, రేగిడి, సంకిలి పీఏసీఎస్ అధ్యక్షులు వంజరాపు అశోక్, లావేటి వెంకటవేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు జరగాలి

- కలెక్టర్ నాగలక్ష్మి


పీవో, ఏపీవోలకు సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని, ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా చిన్నతప్పు కూడా దొర్లకుండా చూడాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు ఎన్నికల విధుల నిర్వహణపై రెండో విడత శిక్షణ సోమవారం ఇచ్చారు. శిక్షణా శిబిరాన్ని సందర్శించిన ఆమె ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరుపై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, పీవోలు, ఏపీవోల విధులు, బాధ్యతలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల రోజున 5.30 గంటలకు మాక్‌పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, అప్పటికీ ఏజెంట్లు రాకపోతే మరో 15 నిమిషాలు ఎదురుచూసి వారు వచ్చినా రాకున్నా 5.45 గంటలకు మాక్‌పోలింగ్ జరపాలని ఆదేశించారు. నిర్ణీత సమయానికి ఈ ప్రక్రియ ప్రారంభించాలని, అందుకోసం ఉదయం 5గంటలకే పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు పూర్తిచేయాలని తెలిపారు. పోలింగ్ రోజున పీవోల బాధ్యత చాలా కీలకమని, రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదన్నారు. మాక్ పోలింగ్ పూర్తయిన అనంతరం వీవీ ప్యాట్‌లను ఖాళీ చేయాలని, ఈవీఎంలను రీసెట్ చేసిన తర్వాత 7 గంటలకే పోలింగ్ ప్రారంభించాలన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లు గురించి బీఎల్‌వోలు గానీ ఎంపీడీవో గానీ ధ్రువీకరించిన తర్వాతనే వారిని ఏజెంట్లుగా అనుమతించాలన్నారు. ఏజెంట్లు నియోజకవర్గానికి చెందిన ఓటరు అయి ఉండాలన్నారు. పీవోలు ఫారం 17సి, పీవో డైరీ, పీవో రిపోర్టు, పీవో డిక్లరేషన్‌లను తప్పులు లేకుండా అన్నిట్లో ఒకే విధమైన వివరాలతో నింపాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో ఎల్.జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

మెంటాడ: స్థానిక దిగువ వీధిలోని సీతారాముల ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎం.నగేష్ తదితరులు పాల్గొన్నారు.